# రైతులను మోసగించే కనీస మద్దతు ధరల ప్రకటన

**దేశంలో** అధిక మొత్తంలో పండే కొన్ని ప్రధాన పంటలకు జులై 4వ తేదీన కనీస మద్దతు ధరలను ప్రకటించిన కేంద్రప్రభుత్వం మద్దతు ధరలను "చారిత్రాత్మకంగా పెంపు" చేసినట్లుగా చెప్పుకుంటూ తద్వారా తన ఎన్నికల వాగ్దానాన్ని నెరవేర్చినట్లుగా గొప్పలు చెప్పుకుంటోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ మద్దతు ధరలతో, బిజెపి తన ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసిన విధంగా పంటల ఉత్పత్తి ఖర్చుకు ఒకటిన్నర రెట్లు ఆదాయం లభిస్తుందని ఊదరగొడుతోంది.

మద్దతు ధరలలో పెరుగుదల "చారిత్రాత్మక మైనదా?" బిజెపి తన ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసిన రీతిలో పంట ఉత్పాదక ఖర్చుకు ఒకటిన్నర రెట్ల ఆదాయం లభిస్తుందా? అసలు ప్రకటించబడిన మద్దతు ధరలకు రైతాంగం తమ పంటలను అమ్ముకోగలుగుతారా? విసిగి వేసారి, నిరాశా నిస్పృహలతోనున్న లక్షలాదిమంది రైతాంగానికి ఈ చర్యలు ఉపశమనాన్నైనా కలిగిస్తాయా? అనే ప్రశ్నలు ముందుకొస్తున్నాయి.

ఆనవాయితీగా ప్రతిసంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లకు ముందుగా, వ్యవసాయ ఖర్చులు మరియు ధరల సంస్థ (సిఏసిపి) సలహా ప్రకారం కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల పంటల మద్దతు ధరలను ప్రకటిస్తుంది. రైతు సంఘాలనుండి వ్యక్తమౌతున్న తీవ్రమైన వత్తిడి, కొద్దికాలంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల కారణంతో సాపేక్షంగా కొద్దిపాటి పెంపుతో (చారిత్రాత్మకం కాదు) నరేంద్రమోడీ ప్రభుత్వం ఈ సంవత్సరం మద్దతు ధరల ప్రకటన చేసింది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన సూత్రం ప్రకారం (సి2+50 శాతం) మద్దతు ధరలు పెంచాలని అనేక రైతు సంఘాలు దీర్ఘకాలంగా చేస్తున్న డిమాండ్‌కు అనుగుణంగా ప్రస్తుత మద్దతు ధరల పెంపు ప్రకటన వుందనటం వంచనాత్మక మైనది. ఉత్పత్తి ఖర్చుకు ఒకటిన్నర రెట్లు ఆదాయం లభిస్తుందని చెబుతున్న మోడీ ప్రభుత్వం, వాస్తవిక ఖర్చు, మరియు కుటుంబ శ్రమ విలువలను కలిపిన (ఎ2+ఎఫ్ఎల్) సూత్రాన్ని పాటించింది తప్ప, వాస్తవిక ఖర్చు, కుటుంబ శ్రమలకు భూమికి చెల్లించే కౌలు, మదుపుపై చెల్లించాల్సిన వడ్డీలను కలిపే 'సి2' సూత్రాన్ని పాటించలేదు. ఈ రెంటికీ మధ్య చాలా తేడా వుంది. ధాన్యం ఉదాహరణ తీసుకుందాం. ఏ2+ఎఫ్ఎల్ సూత్రం ప్రకారం క్వింటా ధాన్యం దిగుబడి ఖర్చు రూ. 1166 కాగా స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అనగా సి2 ప్రకారం క్వింటా ధాన్యం దిగుబడి ఖర్చు రూ. 1560. కనుక స్వామినాథన్ కమిషన్ సూత్రాల ప్రకారం క్వింటా ధాన్యం మద్దతుధర రూ.2340గా వుండాలి. కాగా, ప్రభుత్వం ప్రకటించిన ధర రూ.1750 మాత్రమే. క్వింటా ధాన్యానికి రూ. 590 తేడా వుంది.

**(పట్టిక 1** చూడండి).

**పట్టిక: 1 స్వామినాథన్ సూత్రం ప్రకారం మరియు కనీస మద్దతు ధరల ప్రకారం లెక్కగట్టిన ప్రధాన పంటల విలువ**

| పంట | స్వామినాథన్ సూత్రం ప్రకారం క్వింటాకు ఖర్చు సి2 (రూ॥లలో) | స్వామినాథన్ సూత్రం ప్రకారం క్వింటా ధర సి2+50% | ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (క్వింటాల్‌కు రూ॥ల్లో) | సి2+50% ధరకు కనీస మద్దతు ధరకు మధ్య తేడా (రూ॥ల్లో) |
|---|---|---|---|---|
| ధాన్యం | 1560 | 2340 | 1750 | 590 |
| జొన్న | 2123 | 3274 | 2430 | 844 |
| కందులు | 4981 | 7471 | 5675 | 1796 |
| పెసలు | 6161 | 9241 | 6975 | 2266 |
| వేరుశనగ | 4186 | 6279 | 4890 | 1389 |
| సోయా | 2972 | 4458 | 3399 | 1059 |
| మొక్కజొన్న | 1480 | 2220 | 1700 | 520 |
| పత్తి | 4514 | 6771 | 5150 | 1621 |

కనీస మద్దతుధర పెంపును మోడీ ప్రభుత్వం చారిత్రాత్మకమని కూడా పేర్కొంటోంది. ఇతర అంశాలవలెనే ఇదికూడా ఓ బూటకపు ప్రచారం మాత్రమే. మోడీ ప్రభుత్వం మొదటినాలుగు సం॥ల పాలనలో, ప్రధాన పంటల కనీస మద్దతు ధరలలో

పెరుగుదల చాలా స్వల్పంగా, వినియోగదారుల ధరల సూచీలో పెరుగుదల కంటే కూడా తక్కువగా మాత్రమే ఉంది. ప్రభుత్వం యొక్క ఆర్భాటపు ప్రకటనలలోని బూటకత్వాన్ని పట్టిక తెలియజెప్తోంది. **(పట్టిక 2** చూడండి)

**పట్టిక: 2 గత దశాబ్ద కాలంలో ధాన్యం కనీస మద్దతు ధరలు**

| సంవత్సరం | కనీస మద్దతు ధర (ఎమ్ఎస్పి) | పెరుగుదల రూ॥లో | గత సం॥రంతో పోల్చితే పెరుగుదల (శాతంలో) |
|---|---|---|---|
| 2006-07 | 500 | | |
| 2007-08 | 645 | 145 | 29 |
| 2008-09 | 850 | 205 | 32 |
| 2009-10 | 950 | 100 | 12 |
| 2010-11 | 1000 | 50 | 05 |
| 2011-12 | 1080 | 80 | 08 |
| 2012-13 | 1250 | 170 | 16 |
| 2013-14 | 1310 | 60 | 05 |
| 2014-15 | 1360 | 50 | 04 |
| 2015-16 | 1410 | 50 | 04 |
| 2016-17 | 1470 | 60 | 04 |
| 2017-18 | 1550 | 80 | 05 |
| 2018-19 | 1750 | 200 | 13 |

కనీస మద్దతు ధరల యంత్రాంగం ప్రాథమికంగా, గోధుమ, ధాన్యం వంటి పంటలను మాత్రమే ఎఫ్సిఐ వంటి ప్రభుత్వ సంస్థల ద్వారా సేకరించటంలో అమలు చేయబడుతుంది. ఈ సేకరణలు నిర్దిష్ట రాష్ట్రాలకు మాత్రమే పరిమితం. ఉత్తరప్రదేశ్, బీహార్, అస్సామ్ మరియు ఇతర ఈశాన్య రాష్ట్రాలలో ఈ ప్రభుత్వ సేకరణ సంస్థల ఉనికే లేదు. పైగా ఆపద్ధర్మ నిల్వలలో లోటు పూడ్చుకునే మేరకు మాత్రమే ధాన్యం, గోధుమలను సేకరించటానికి పరిమితం కావాలని ప్రభుత్వం గతంలో ఎన్నడో నిర్ణయించింది. దీనికి మించి అదనంగా సేకరిస్తే, అది ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సి వుంటుందనేది స్పష్టం. కేంద్ర ప్రభుత్వం ఎఫ్సిఐ సేకరణ కార్యకలాపాల్ని నిలిపివేసి, దాని తరపున రాష్ట్రాల ప్రభుత్వాలనే సేకరించమని అడుగుతోంది. వీటన్నిటినీ మించి, ఆహార సబ్సిడీలు భారమయ్యాయనే పేరిట ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థను మూసివేయాలని నిర్ణయించింది. కనుక, కనీస మద్దతుధరల ప్రకటన మాత్రమే రైతుల అదనపు ఆదాయాలకు వాస్తవిక రూపం కల్పించ లేదు. ప్రభుత్వ సేకరణ సంస్థలు రంగంలో లేక పోవటం వలన కనీస మద్దతుధరే గరిష్ట అమ్మకపు ధరగా మారుతోందని గత రెండు దశాబ్దాల అనుభవం తెలియజేస్తోంది.

విమర్శకుల నుండి ఈ దృష్టికోణాన్ని వూహించిన కేంద్ర ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రవేశ పెడుతూ నీతి ఆయోగ్ కేంద్రం మరియు రాష్ట్రాలతో సంప్రదించి లోపరహితమైన యంత్రాంగాన్ని ఏర్పరుస్తుందని వాగ్దానం చేశాడు. ప్రభుత్వ కనీస మద్దతుధర కంటే మార్కెట్‌లో ధరలు ఏమాత్రం తగ్గినా రైతులు నష్టపోకుండా తగిన పరిహారాన్ని పొందడానికి వీలుగా ఈ యంత్రాంగం కృషి చేస్తుందని ప్రకటించాడు. అయితే ఈ దిశగా కసరత్తులు జరగటంగానీ, ఈ సంవత్సరం పంటల సేకరణ వ్యూహాన్ని గురించిన ప్రకటనగానీ లేదు.

○○○○